క్లుప్తంగా

పాఠశాల వార్షికోత్సవం

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 60వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఆనంద్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఎంఈఓ సత్యనారాయణ హాజరై మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థులను శాలువాలతో సన్మానించారు.

రక్తదాన శిబిరం

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామంలో జాయ్స్ స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకట్‌ప్రకాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ చైర్మెన్ హనీఫ్, స్మైల్ ఫౌండేషన్ బాధ్యులు కుంజా రామకృష్ణ, కృష్ణవేణి, పాస్టర్ లాజరస్, కృష్ణ, కాంగ్రెస్ నాయకులు నల్లమోతు రమణ పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

అన్నపురెడ్డిపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులు ప్రభుత్వం విధించిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గుంపెన సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులను సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు సంధ్యారాణి, ప్రశాంత్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం పలుచోట్ల బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో జెండా ఎగుర వేశారు. కార్యకర్తల ఇళ్లపై బీజేపీ జెండాలను ఏర్పాటు చేశారు. సీనియర్ నాయకులను సన్మానించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్యకర్తలను దిశానిర్దేశం చేశారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూనవరం గ్రామానికి చెందిన కణితి రమేష్ వైద్య ఖర్చుల నిమిత్తం అమృత హస్తం చారిటబుల్ ట్రస్ట్ రూ.3వేలను అందజేసింది. ఆ మొత్తాన్ని బాధితుడికి చేరవేయాల్సిందిగా స్నేహితుడు రామకృష్ణకు శనివారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు వల్లభనేని రమణ, దాట్ల సూర్యనారాయణ రాజు (వంశీ), కుర్సం శేఖర్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని అర్హులైన ముస్లిం మహిళలకు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా శనివారం చీరలను పంపిణీ చేశారు. స్థానిక సుభాస్ కారేపల్లి బజార్ మజీద్‌-ఏ-జమాన్, అశోక్ నగర్ కొత్త కాలనీ మదర్సా జామియా ఇస్లామియా వద్ద ఆర్థిక సహాయంతో పాటు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్గనైజర్ ఎస్‌కె.ఉస్మాన్, బక్షి, మొహమ్మద్ బాబాజీ, పాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని కిచ్చెనపల్లి ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శశికుమార్ పదవి విరమణ పొందారు. కాగా ఆయనకు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మర్కోడు కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగేశ్వరావు, ఆళ్లపల్లి హెచ్‌ఎం.కొమరం శాంతారావులు మాట్లాడారు. కార్యక్రమంలో మర్కోడు కాంప్లెక్స్ హెచ్‌ఎం బాబూలాల్, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి హతిరామ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకటనపై హర్షం

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని అబేడ్కర్ సెంటర్‌లో నూతన విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ప్రకటించడంపై దళిత సంఘాల నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం జరిగిన దళిత సంఘాల నాయకుల సమావేశంలో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పేర్కొన్నారు. ముద్దా పిచ్చయ్య, అలవాల రాజా పెరియార్, వెంకటేశ్వర్లు, ఏవీ రావు, సుధాకరరావు, ముత్యం పాల్గొన్నారు.

తునికాకు సేకరణ చేపట్టాలి

అశ్వారావుపేటరూరల్: తక్షణమే తునికాకు సేకరణ చేపట్టి, గిరిజనులకు ఉపాధి కల్పించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంగాల కల్లయ్య, వాసం బుచ్చిరాజు, కంగాల భూలక్ష్మి పాల్గొన్నారు.

కొలతలను పరిగణించొద్దు

మణుగూరుటౌన్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు కొలతలు లేకుండా కూలి చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు అన్నారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధి హామీ వంద రోజుల పని ప్రదేశాన్ని సందర్శించి కార్మికులతో మాట్లాడారు.

ఉపశమనాల అమ్మకాలు అదరహో..

- కొబ్బరి బోండాలు, పుచ్చకాయలతో చలువ
- పోషకాలతో తాటి ముంజ
- ఎండల ధాటికి మంచి డిమాండ్



మణుగూరురూరల్: తాటిముంజలను తీసి ప్యాకింగ్ చేస్తున్న వ్యాపారులు



బూర్గంపాడుకు సమీపంలో రోడ్డు పక్కన పుచ్చకాయల విక్రయాలు

సండే స్పెషల్

బూర్గంపాడు/మణుగూరురూరల్: ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఎండలకు బయటకు వెళ్లాలంటేనే జనాలు బెంబేలెత్తుతున్నారు. ఇదే సమయంలో వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు ఎక్కువయ్యాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లిన జనాలు ఎండల నుంచి ఉపశమనానికి కొబ్బరి బోండం నీళ్లు తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఎండల వేడిని తట్టుకుని చలువ చేసేందుకు పుచ్చకాయలు, తాటి ముంజలను తింటున్నారు. ప్రస్తుతం రోడ్లవెంట కొబ్బరి బోండాలు, పుచ్చకాయలు, తాటి ముంజల విక్రయాలు ఊపందుకున్నాయి. ధరలు ఒకింత ఎక్కువగానే ఉన్న ఎండల నుంచి ఉపశమనానికి ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కొబ్బరిబోండం ధర ఒక్కటి రూ.35కు పైగానే పలుకుతోంది. పుచ్చకాయ ఒక్కటి రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. తాటి ముంజలు డజను రూ.50 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. ధరలు ఎక్కువగా ఉన్న రోడ్ల వెంబటి అందుబాటులో ఉండటంతో ప్రజలు వీటిని కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తూ ఉన్నారు.

తాటి ముంజల తీరే వేరు..

ఐస్ యాపిల్స్‌గా పిలువబడే తాటి ముంజలు చూడడానికి జెల్లిల్లా ముట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. తాటిముంజలను తీసుకోవడం ద్వారా వాటిలో నీటి శాతం ఎక్కువగా ఉండి వేసవి తాపం నుండి, డీహైడ్రేట్ సమస్య నుంచి తక్షణ ఉపశమనం పొందవచ్చు. తాటిముంజల్లో ఉండే విటమిన్ బి, ఐరన్, కాల్షియం శరీరానికి మేలు చేకూర్చుతాయి. తాటి ముంజల్లో క్యాలరీలు తక్కువ మొత్తంలో శరీరానికి కావాల్సిన శక్తి అధిక మొత్తంలో ఉంటుంది.

ముంజలతో గర్భిణులకు మేలు..

గర్భస్థ సమయంలో మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటుంటారు. ప్రధానంగా ఏది తిన్నా జీర్ణం కాక ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి సమయంలో గర్భిణులు తాటి ముంజలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పని చేస్తుంది. మలబద్ధకం, ఎసిడిటీ లాంటి సమస్యలను దూరం చేస్తాయి.



బూర్గంపాడు: లక్ష్మీపురం వద్ద కొబ్బరి బోండాల విక్రయాలు..

ఆరోగ్యానికి మంచిది..

తాటి ముంజలు శరీరంలో వివిధ రకాల ట్యూమర్స్, కేన్సర్ కణాలను వృద్ధి చేసే ఫైటోకెమికల్, అంథోసయనిన్ వంటి వాటిని నిర్మూలిస్తాయి. శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచి మినరల్స్, న్యూట్రిషియన్ల శాతాన్ని బ్యాలెన్స్ చేయడంలో తాటిముంజలు కీలకపాత్ర పోషిస్తాయి.

ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

భద్రాచలం: తెలంగాణ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కరువతో ఎండిపోతున్న రైతులను నష్టపరిహారంతో ఆదుకోవాలని కోరుతూ భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసనలు తెలిపారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ఆర్డీఓ దామోదర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ.. సాగునీరు విడుదల చేయకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని, వరి పంటకు రూ. 500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించి అమలు చేయలేదని విమర్శించారు. నిరసన కార్యక్రమాల్లో నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, గొడవర్తి నరసింహమూర్తి, తాండ్ర వెంకట రమణారావు, వాసు రాజు, వివిధ మండలాల అధ్యక్షుడు గంపా రాంబాబు, అన్నెం సత్యాలు, దుమ్ముగూడెం ఎంపీపీ రేసు లక్ష్మి నాయకులు మురళి, దర్రా దామోదర్, సత్యనారాయణ, దొడ్డి తాతారావు, అజీజ్ రాము పవన్ కుమార్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: పంటలు ఎండిపోయి నష్టపోతున్న అన్నదాతలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు కొద్దిసేపు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సంకా ప్రసాద్, సత్యవరపు సంపూర్ణ, జేకేపీ రమణారావు, నారం రాజశేఖర్, అబ్దుల్ జిన్నా, దారా యుగంధర్ పాల్గొన్నారు.



భద్రాచలం: అంబేడ్కర్ సెంటర్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అశ్వారావుపేటరూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

మతోన్మాద బీజేపీని ఓడించాలి

మణుగూరుటౌన్: దేశంలో మతోన్మాద బీజేపీని ఓడించి, లౌకికవాద ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడే పార్టీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.షాబీర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో సరెడ్డి పుల్లారెడ్డిమ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో రెండోసారి బీజేపీ ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు బహుజనులపై దాడులు పెరిగాయని, ప్రశ్నించే వారిని అణగదొక్కుతున్నారన్నారు. ఈడీ, సీబీఐ, ఈడీ పేర్లతో దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, నాయకులు ప్రసాద్, ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మీకుమారి, కల్లూరి వెంకటేశ్వరరావు, కమటం వెంకన్న, దేవరకొండ శంకర్, సలిగంటి శ్రీనివాస్, సలీం, భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే షాబీర్

ఆదివాసీ జేఏసీ మండల కమిటీ ఎన్నిక

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్ రోడ్డులోని ఆదివాసీ భవన్‌లో శనివారం కుంజా రామారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆదివాసీ జేఏసీ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడుగా కల్లూరి నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా తోకల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సప్కా నరేష్, కోశాధికారిగా బండ్ల రామచంద్రయ్య, సహాయ సలహాదారుడుగా సోడే రమేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు మాట్లాడారు. ఆదివాసీ సీనియర్ నాయకులు తంగెళ్ల భద్రయ్య, కుంజా రామారావు, పాయం సర్వేశ్వరరావు, పొడియం అనిల్‌కుమార్, బండ్ల మునీశ్వరరావు, చాప ముత్తయ్య, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, నరసింహారావు, పర్శిక సూరిబాబు, కాకా అశోక్ తదితర నాయకులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

'ప్రజల దృష్టి మరల్చడానికే ధర్నాలు'



సమావేశంలో మాట్లాడుతున్న వినీల్

దుమ్ముగూడెం: గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన మోసాలు బయట పడుతుండడంతో ప్రజల దృష్టిని మరల్చడానికి ఆ పార్టీ నాయకులు రైతుల పేరిట ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ విమర్శించారు. లక్ష్మీనగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రైతులను అన్నివిధాలుగా మోసం చేశారని, రైతుబంధు ఇస్తున్నామంటూ మిగతా పథకాలను తొలగించారని ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులకు ఏనాడు పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవని చెప్పారు. కానీ ఇప్పుడు రైతుల పేరిట బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దీక్షలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు బత్తుల శోభన్ బాబు, మద్ది రామిరెడ్డి, నటరాజ స్వామి, అప్పలరెడ్డి, కుషిని రవి, దాసుపల్లి ఉపేంద్ర, శ్రీను, మద్ది వనజ, కనుబుద్ది దేవా పాల్గొన్నారు.

జాతర ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామ శివారులో ఉన్న చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం ఉదయం నుంచి జాతర మహోత్సాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ అర్చకుల సమక్షంలో తెల్లవారుజామునే విఘ్నేశ్వర పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించగా, అమ్మవారిని మహాలక్ష్మి అమ్మవారి అవతారం అలంకరించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పాతచర్లలో వైద్య శిబిరం

చర్లరూరల్: మండలంలోని పాతచర్ల పూజారిగూడెం ప్రాంతంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ జ్వరాలు ఉన్నవారికి చికిత్సలు అందించారు.ఎండలు తీవ్రంగా ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు వేసే టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బంది వేణు గోపాలకృష్ణ, రాంప్రసాద్, శిరీష, లలిత, ధర్మారావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు..

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాద్రి ఏజెన్సీలో గత రెండు రోజులుగా భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. తెల్లారితే చాలు వేసవి భగభగలు ప్రజల్ని హడలెత్తిస్తున్నాయి. జిల్లాలో శనివారం నమోదైన ఉష్ణోగ్రతల్లో భద్రాచలంతో పాటు అశ్వాపురం మండలంలో రికార్డు స్థాయిలో 43 డిగ్రీలు దాటి మొదటి స్థానంలో ఉన్నాయి. కాగా, పక్కనే ఉండే బూర్గంపాడు మండలంలో జిల్లాలోనే తక్కువగా 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి మొదలవుతున్న ఎండ వేడిమి రాత్రి ఏడు దాటినా తగ్గడం లేదు. నిత్య రద్దీగా ఉండే రోడ్లు పగటి పూట నిర్మానుష్యంగా మారుతుండడంతో పాటు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



నిర్మానుష్యంగా కూనవరం రోడ్డు

సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి

చర్ల: రాష్ట్రంలో 10 లక్షల మందికి పైగా రజకులు వృత్తిపై ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారని, వీరందరినీ ఆదుకునేందుకు ప్రతీ గ్రామంలో రజక సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన చర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రజక ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా వడ్డీలేని రుణాలను ఇప్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు చిటికెన ముసలయ్య, రేగళ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ధర తగ్గించాలి

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే రామయ్య కల్యాణాన్ని సామాన్య భక్తులు సైతం వీక్షించే విధంగా కల్యాణ టికెట్ ధరలను తగ్గించాలని పరశురాం పరివార్ హిందూ సంస్థ ఆధ్వర్యంలో ఆయల ఈఓ రమాదేవికి శనివారం వినతి పత్రం అందజేశారు. పలు సమస్యలను ఈవో దృష్టికి తీసుకెళ్ళగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా పరశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తవరపు రాజశేఖర్ మాట్లాడుతూ.. కల్యాణానికి సంబంధించి వాడవాడలా ప్రచారం నిర్వహించాలని, భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాటు చేయాలి కోరారు. కార్యక్రమంలో దేవులపల్లి సాయికిరణ్, కరకు ప్రసాద్, శ్రీను, యోగానంద రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలు చోట్ల ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు అధికారుల ఆధ్వర్యంలో ఓటు ప్రాధాన్యతను వ్యక్త పరుస్తూ ముగ్గులు పోటీలు ఏర్పాటు చేశారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆయుధం లాంటిదని, దానిని వినియోగించుకోవాలని సూచించారు. ఓటు ద్వారా సరైన నాయకుడిని ఎన్నుకుని దేశ అభివృద్ధిని, తద్వారా ఓటు భవిష్యత్‌ను నిర్ణయించవచ్చని తెలిపారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఐసీడీఎస్ అధికారులు, ఎంపీఓ, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ రంగారావు



మణుగూరుటౌన్: విజేతకు బహుమతి అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



బూర్గంపాడు ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్



గుండాల: ఓటుపై అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ..



అశ్వారావుపేటరూరల్: విజేతలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ కృష్ణప్రసాద్



దుమ్ముగూడెం: అవగాహన కల్పిస్తున్న అధికారులు



చంద్రుగొండ: సెల్ఫీ పాయింట్ వద్ద ఎంపీడీఓ అశోక్, తదితరులు

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



మణుగూరుటౌన్: తుక్కుగూడ బహిరంగ సభకు వెళ్తున్న మణుగూరు నాయకులు

దమ్మపేట: హైదారాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన జాతర సభకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు శనివారం బయలుదేరి వెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బస్సుల్లో కార్యకర్తలు, అభిమానులు వెళ్లారు. మండల స్థాయి నాయకులు కార్లలో వెళ్లారు.

మణుగూరుటౌన్: తుక్కుగూడలో రాహుల్‌గాంధీ రానున్న భారీ బహిరంగ సభకు శనివారం ఉదయం నుంచే మండల కాంగ్రెస్ నాయకులు బయల్దేరి వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వరరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపు మేరకు మహబూబాబాద్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ మణుగూరు మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్ ఆధ్వర్యంలో మణుగూరు నుంచి భారీగా వాహనాలు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా నాయకులు జెండా ఊపి ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అశ్వాపురం: తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శనివారం తరలివెళ్లారు. అశ్వాపురంలో ప్రజాప్రతినిధులు, నాయకుల వాహనాలను ఓరుగంటి భిక్షమయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, మాజీ ఎంపీపీ ఊసా అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బట్టా సత్యనారాయణ, చెంచల రాము, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని ప్రగళ్ళపల్లి పంచాయతీ పరిధిలోని బైరాగులపాడు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకెపీ ఏపీయం హేమంతిని మాట్లాడారు. ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

మణుగూరుటౌన్: పాత మణుగూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 'వికసిత్ భారత్- సమాజం, దేశం కోసం నా వంతు కృషి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆంగ్ల ఉపాధ్యాయుడు నాగుల్‌మీరా సహకారంతో ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణజ్యోతి బహుమతులు అందజేశారు. సావిత్రి, ధనలక్ష్మి, కల్పనా దేవి, జ్యోతి పాల్గొన్నారు.

విచారణ జరపాలి

దుమ్ముగూడెం: మండలంలో రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా మంజూరు చేస్తున్న ఎస్సీ కులధృవీకరణ పత్రాలపై విచారణ జరపాలని దళిత హిందూ మాలనాడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాకుడు వెంకట్రాజు డిమాండ్ చేశారు. శనివారం గంగోలు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.